ప్రజాశక్తి

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# జోన్ కార్యకలాపాలకు జాప్యమెందుకు?

- 30 నుంచి 40వేల చదరపు అడుగుల స్థలం అవసరం : తాజా డిపిఆర్ వెల్లడి
- పరిశీలనలో గోశాల దేవస్థానం వద్ద 2 కల్యాణ మండపాలు, ఎల్ఐసి బిల్డింగ్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఖాళీ భవనాలు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన జరిగింది. వాల్తేరు రైల్వేను విశాఖపట్నం రైల్వేగా కొనసాగించేందుకు కేంద్రం ఏళ్లతర్వాత అంగీకరించడం కూడా అయ్యింది. విశాఖపట్నం రైల్వే నూతన డిఆర్‌ఎం విధుల్లో చేరుతున్నట్లు ప్రకటన కూడా వెలువడింది. అయినా విశాఖ కేంద్రంగా నూతన 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' కార్యకలాపాల విషయంలో హడావుడి కానరావడం లేదు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ప్రకటన అప్పట్లో వచ్చిన వెంటనే అక్కడి ప్రభుత్వం క్వార్టర్స్, ఆఫీసు భవనాలను సిద్ధం చేసుకుందని రైల్వే వర్గాల్లో చర్చ మొదలైంది. కాగా, కొత్త రైల్వేజోన్‌కోసం ఏర్పాటు చేయబడ్డ ప్రత్యేకాధికారి కార్యాలయం ఈ నేపథ్యంలో ప్రాజెక్టు సవివరణ నివేదిక (డిపిఆర్)లో తాజాగా 30 నుంచి 40వేల మేరకు స్థలం కొత్త జోన్ కార్యాలయ పనుల కోసం కావాలని రైల్వే బోర్డుకు నివేదించినట్లు భోగట్టా. రైల్వే జోన్ కోసం బిడ్డింగ్ రెండు నెలల క్రితమే పూర్తయింది. 2026 సంవత్సరంలో జోన్ పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లోగా జోన్ కార్యకలాపాలకైతే ఎలాంటి ఆటంకం ఉండకూడదన్న వాదన రైల్వే అధికారులు, సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

**జోన్ కార్యకలాపాలకు స్థల సమస్య లేదు..**

ఈ నేపథ్యంలో తాజా డిపిఆర్ ప్రకారం సింహాచలం దేవస్థానం ఇటీవలే గోశాల వద్ద మెయిన్ రోడ్డుకు దగ్గర్లోనే అటు, ఇటు కొండల నడుమ రెండు కళ్యాణ మండపాలు నిర్మాణం పూర్తిచేసింది. సుమారు 50 రూముల సామర్థ్యం ఉన్నవి కావడంతో జోన్ కార్యాలయ హెడ్‌క్వార్టర్‌గా జిఎం ఆఫీసు, చీఫ్ ఇంజినీరు, చీఫ్ ఆపరేషన్ మేనేజర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ ఇలా జోనల్ స్థాయి అధికారులంతా ఆశీనులై విధుల నిర్వహణకు ఈ స్థలం బాగుంటుందన్న ఆలోచన ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది. అంతేగాక విశాఖ నగరం నడిబొడ్డున ఎల్ఐసి భవన సముదాయంలో ఒక కాంప్లెక్స్ (సుమారు 20వేల ఎస్ఎఫ్‌టి), ఆర్‌టిసి కాంప్లెక్స్ మేడపైన 12వేల ఎస్ఎఫ్‌టి ఖాళీ ప్రదేశం కూడా అందుబాటులో ఉంది. ఈ విషయాలన్నీ డిపిఆర్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం కూడా టెండర్లు పిలిచి ప్రైవేట్ వాళ్లకు ఇవ్వాలన్న నిర్ణయంతో ఉంది. ఈ ప్రక్రియ పూర్తవ్వాలంటే ఏడాది కాలం పడుతున్నందున రైల్వేకు కేటాయిస్తే టెండర్లు పిలిచేలోగా దేవస్థానానికి ఆదాయం వస్తుందన్న ప్రతిపాదన చేశారు.

**తూర్పు కోస్తా ఏర్పాటైన వేళలో...**

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు టెండర్లనైతే రైల్వే బోర్డు పిలిచినా ఆ తర్వాత పని స్లోడౌన్ అయిందని అధికారులే స్వయంగా పేర్కొంటున్నారు. తూర్పు కోస్తా రైల్వే భువనేశ్వర్ కేంద్రంగా ప్రారంభించేందుకు ప్రకటన కేంద్రం చేసిన సందర్భంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..

## డిఆర్‌ఎంగా లలిత్ బోహ్రా బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్‌గా 1998 బ్యాచ్ ఐఆర్‌టిఎస్ అధికారి లలిత్ బోహ్రా సోమవారం బాధ్యతలు చేపట్టారు. భారత ప్రభుత్వ నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఇ)లో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఎంఎన్ఆర్ఇలో సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు పిఎం సూర్యఘర్, ముఫ్త్ బిజాలీ యోజన, పిఎం-కుసుమ్, ఆఫ్‌సోర్ విండ్, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, పిఎల్ఐ స్కీమ్ ఫర్ సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. నూతన ట్రాఫిక్ కమర్షియల్ అండ్ పాలసీ రూపకల్పనలో విస్తృత అనుభవం ఉంది. ఆయన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్ఇ) డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా పనిచేశారు. రైల్వేలో పనిచేస్తూనే చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టేషన్ మేనేజర్‌గా, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జనరల్)గా పలు విభాగాల్లో విధులు నిర్వహించారు. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్న సమయంలో ఆయన అతిపెద్ద డ్రై పోర్టు, డబుల్ స్టాక్ కంటైనర్ రైళ్లను నడపడంలో కీలక పాత్ర పోషించారు. లలిత్ బోహ్రా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే నుంచి బి.టెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీర్), పిలానీలోని బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంబిఎ (ఫైనాన్స్) చేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న లలిత్ బోహ్రా

## 28 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి చేపట్టిన ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతాయని కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆధార్ నమోదు, చేర్పులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించాలని ముందుగా ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ ఆదేశాల మేరకు

మిగతా 2లో..

### బాల కార్మిక నిర్మూలనపై సమీక్ష

▶ వార్త 2లో..

### పోక్సో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం

▶ వార్త 2లో..

### గ్యాస్ డెలివరీలో అక్రమాలుంటే చర్యలు : జెసి

▶ వార్త 8లో..

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న డిసిహెచ్.వెంకటేశ్వరరావు

## ప్యాకేజీలో జీతాలకు ప్రాధాన్యమేదీ?

**ప్రజాశక్తి -ఉక్కునగరం:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో కార్మికుల జీతాలకు ప్రాధాన్యత ఉంటుందని కేంద్ర స్టీల్ సహాయమంత్రి శ్రీనివాసవర్మ చెబుతున్నప్పటికీ స్థానిక యాజమాన్యం చెల్లించడంలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరావు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1474వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ

మిగతా 2లో..

# ప్రజాభిప్రాయాలను గౌరవించాలి

### పిజిఆర్ఎస్‌పై సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ప్రజల అవసరాలను గుర్తిస్తూ, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ అధికారులు ఉత్తమ సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వరమే పరిష్కారం చూపుతూ వారికి అండగా నిలవాలని సూచించారు. పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారం, పెండింగ్ దరఖాస్తులు, ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి, ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఓ అరగంట పిజిఆర్ఎస్ కోసం కేటాయించాలని, తద్వారా పరిష్కారంలో నాణ్యత పెరుగుతుందని చెప్పారు. ఒక సారి వచ్చిన దరఖాస్తు మళ్లీ రాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని, ఫిర్యాదుదారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా వ్యవహరించాలని సూచించారు. ఎక్కువగా దరఖాస్తులు వచ్చే శాఖలు మరింత బాధ్యతగా వ్యవహారించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన వినతులు, వాటిపై ఆయా శాఖలు తీసుకున్న చర్యలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు.

పిజిఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

**విశాఖ 2029 విజన్ ప్లాన్‌పై దృష్టి**

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళిక 2029పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. 10 ప్రామాణిక సూత్రాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళికలను అమలు పరచాలని చెప్పారు. జిల్లా ప్రణాళిక ఆధారంగా నియోజకవర్గ స్థాయ ప్రణాళికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలని, అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా

మిగతా 2లో..

# బాలకార్మిక నిర్మూలనపై సమీక్ష

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నంలో బాల కార్మికుల నిర్మూలనపై కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యాన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక రక్షణ చర్యల ద్వారా శిశు, కౌమార కార్మికులను కాపాడే కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ముందుగా బాల కార్మికుల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఉప కార్మిక కమిషనర్ మాట్లాడుతూ, జిల్లాలో 10 ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించామని, 170 మంది పిల్లలను కార్మిక స్థితి నుండి బయటకు తెచ్చామని, 10 కేసుల్లో చర్యలు తీసుకున్నట్లు వివరించారు. 9 కేసుల్లో రూ.20 వేలు బాల, కౌమార కార్మిక పునరావాస నిధికి సేకరించినట్లు తెలిపారు. మంత్రిత్వ శాఖ సూచనల మేరకు రక్షణ చర్యలు మూడు దశల్లో చేపట్టినట్లు వివరించారు. శిశు కార్మిక సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించడం, శాఖల మధ్య సమన్వయం, కార్యాచరణ ప్రణాళికతో ముందుకుకెళు_న్నట్లు పేర్కొన్నారు. పిల్లలను హానికరమైన, ప్రమాదభరితమైన వృత్తులు, పనుల నుంచి రక్షించి తక్షణ సహాయం అందించడం, పునరావాసం, చట్టపరమైన చర్యలు, పరిహారం అందించడం, విద్యా, సంక్షేమ కార్యక్రమాలలో పిల్లలు పాల్గొనేలా చేయనున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులు కఠినంగా నిబంధనలను అమలు చేయాలని, రెగ్యులర్ రక్షణ చర్యలు చేపట్టాలని, నిత్యం పురోగతిపై నివేదికలు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

బాల కార్మిక నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

## మొదటి పేజీ తరువాయి..

### జోన్ కార్యకలాపాలకు జాప్యమెందుకు?

త్వరిత గతిన అందుకు సంబంధించిన రైల్వే ఉద్యోగ, అధికారులకు క్వార్టర్స్, ఆఫీస్ భవనాలను సిద్ధం చేసిన విషయాన్ని తాజాగా విశాఖ రైల్వే ఉద్యోగులంతా గుర్తుచేసుకుంటున్నారు. ఆ తరహాలో ఇక్కడ జోన్ కార్యకలాపాల కోసం సిద్ధపడకుండా జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రజాభిప్రాయాలను గౌరవించాలి

రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్, ఎడిసిపి రాజ్ కమల్, జివిఎంసి, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### ప్యాకేజీలో జీతాలకు ప్రాధాన్యమేదీ?

విభాగాలకు చెందిన సిఐటియు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పిఎఫ్ ట్రస్ట్‌కు యాజమాన్యం చెల్లించాల్సిన రూ.600 కోట్లను నేటికీ చెల్లించలేదని తెలిపారు. కార్మికులు పొదుపు సంఘం ద్వారా దాచుకున్న రూ.70 కోట్లను, ఎస్ఎబిఎఫ్ ద్వారా కార్మికులు ఇంతవరకు పెన్షన్ కోసం దాచుకున్న డబ్బులను యాజమాన్యం ఉపయోగించుకోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ప్లాంట్‌లో కార్మికులను, అధికారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తూ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో భయాన్ని సృష్టిస్తోందని విమర్శించారు. యాజమాన్యం అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డి.కృష్ణమూర్తి, ఎ.శ్రీనివాసరావు, పి.రామారావు, సతీష్, పోరాట కమిటీ నాయకులు సిహెచ్.సన్యాసిరావు, శ్రీనివాస్, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 28 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

28వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలు, జోనల్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. యుఐడిఎఐ నివేదిక ప్రకారం జిల్లాలో లక్షల పైగా ఉన్న పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అటువంటి పిల్లలను తల్లిదండ్రులు దగ్గరలో ఉన్న సచివాలయం, కామన్ సర్వీస్ సెంటర్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లి ఆధార్ నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆధార్ కార్డు పొందిన ఐదేళ్ల తర్వాత, 15 ఏళ్ల తర్వాత వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేసుకోవాలని, పేరు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్ నెంబర్, లింగ నిర్ధారణ మార్పులకు అవకాశం ఉందని తెలిపారు.

# 'జివిఎంసి కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బకాయి'

సమావేశంలో మాట్లాడుతున్న రొంగలి జగన్నాథం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి కాంట్రాక్టర్లకు బకాయి ఉన్న రూ.400 కోట్లు తక్షణం చెల్లించే చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కాంట్రాక్టర్ల వ్యవస్థాపక అధ్యక్షులు, జివిఎంసి కాంట్రాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జివిఎంసి అన్ని జోన్లలో అభివృద్ధి పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లకు ఏళ్ల తరబడి రూ.400 కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే కూటమి ప్రభుత్వం, నగర మేయర్, ఇన్‌ఛార్జి కమిషనర్ స్పందించి కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయని తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించపోవడం వల్ల చిన్న కాంట్రాక్టర్లు తెచ్చుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైకోర్టుకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకున్న కొంతమందికి మాత్రమే బిల్లులు విడుదల చేశారని తెలిపారు. జనరల్ ఫండ్స్, అమృత తదితర పథకాల కింద పనులు పూర్తి చేసిన చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వాలు మారుతున్నా బిల్లులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పిఎస్.ప్రసాద్, సిహెచ్.ప్రసాదరావు, బాదం సత్యనారాయణ, అంగా రమేష్, ఎంవి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం : మేయర్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుటకు ప్రజలందరూ సహకరించాలని, వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలను విడిచి ప్రజా రవాణాను వినియోగించాలని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన క్యాంపు కార్యాలయం నుండి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్‌టిసి బస్సులో జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను లేదా సైకిళ్లను ఉపయోగిస్తే విశాఖ నగరంలో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

## పోక్సో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** పోక్సో కేసులలో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం అవుతుందని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ అదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ ఆధ్వర్యాన పోక్సో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, అన్ని పాఠశాలలో పిల్లలకు మంచి-చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది మాట్లాడుతూ, పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయలని సూచించారు. పోక్సో కేసులలో శిక్ష చాలా కఠినంగా ఉంటుందని తెలిపారు. సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ మాట్లుడుతూ మార్చి నెలంతా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెజెబి న్యాయమూర్తి వరలక్ష్మి, డిసిపి (క్రైమ్స్) లతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

# "లీడర్'కు జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలి'

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** లీడర్ దినపత్రికకు ఆర్‌డిఒ శ్రీలేఖ జారీ చేసిన వారెంట్ నోటీసును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు జర్నలిస్టు సంఘాల నేతలు సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌కు అందించారు. లీడర్ పత్రికలో వచ్చిన రెండు కథనాలపై నోటీసులు జారీ చేశారని, ఈ నోటీసులు రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, టి.నానాజీ, కె.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహించే సిబ్బందికి సోమవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు పిఒ, ఎపిఒ, ఒపిఒలను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసి కేంద్రం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 13 పిఒలు, 13 ఎపిఒలను, 26 మంది ఒపిఒలను కేటాయించారు. అదనంగా 20 శాతం అనగా మరొక 10 మంది సిబ్బందిని కూడా కేటాయిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. విధులు కేటాయించిన వారందరికీ అధికారి పత్రాలను అందజేశారు. తర్వాత జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్, శిక్షణ నోడల్ అధికారి సుధాసాగర్ ఆధ్వర్యాన వారికి శిక్షణ ఇచ్చారు.

# కెజిహెచ్ రోగులకు పౌష్టికాహారం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** కెజిహెచ్‌కు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నామని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలోని ఎస్ 5 వార్డు వద్ద రోగులకు అందిస్తున్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు, సహాయకులతో మాట్లాడి భోజనం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరఫరా చేస్తున్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని చీఫ్ డైటీషియన్ రమణమూర్తిని ఆదేశించారు.

ఆసుపత్రిలో భోజనాన్ని తనిఖీచేసి రుచి చూస్తున్న కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT ANAKAPALLE**
**E.A.7/2025 E.P.40/2023 in D.R.650/2014**

**Between:**
M/s. Margadarsi Chit Fund Private Limited, Anakapalle Branch, Rep.by its Manager
. . . Decree Holder

**And:**
M.Rajeswara Rao and 3 Others
... J.D.Rs

**NOTICE**

**JDR-1: Majji Rajeswara Rao**
S/o. M.Kondala Rao, aged 53 years, W/as: Hotel Welfare Officer, G.S.W.Boys Hostel, Chammachinta (Vill), Nathavaram (Mandal), Anakapalli District-531115.

ఇందుమూలంగా తెలియచేయునది ఏమనగా వాది తనకు రావలసిన బాకీ రూ. 1,30,512/- (అక్షరంలా ఒక లక్ష ముప్పై వేల ఐదు వందల పన్నెండు రూపాయలు) గాను ఇ.పి. వేసినందున పై అమలు పిటిషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నఎడల **తేది: 11-03-2025న ఉదయం 10-30 ని॥లకు** పైన ఉదహరించిన కోర్టులో స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గాని హాజరై తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**B.V.R.JOGA RAO**
Advocate, Anakapalli.

**నోటీసు**

**మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, కానూరు, విజయవాడలో**
**F.A. No. 659 / 2024**
**(విశాఖపట్టణం జిల్లా వినియోగదారుల ఫోరమ్ విశాఖపట్టణం-2 వారి ఫైలు CC.No.4/2023 )**

బిట్వీన్:
యస్.బి.ఐ. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ...అప్పిలెంట్
మరియు
వద్ది కిరణ్‌చంద్ వగైరా ...రెస్పాండెంట్స్
టు,
**1వ రెస్పాండెంటు:**వద్ది కిరణ్‌చంద్, తండ్రి. విజయరత్నం, నివాస డోర్.నెం.2-20, సెయింట్ పీటర్స్ చర్చ్ దగ్గర, కీతింపేట, భీముని పట్టణం, విశాఖపట్టణం జిల్లా- 531163.

పైనెంబరు అప్పీలు పిటీషన్‌లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీకోర్టువారి ద్వారా, నోటీసు పంపిననూ మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయ వలసినదిగా పైకోర్టు / స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ **ది.13-03-2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30ని॥లకు** మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

**(శ్రీయుత కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)**
వాయిదా తేది.**13-03-2025**

**మన్నవ శ్రావణ్‌కుమార్, గోవిందు సుధామాధురి, మన్నవ మదాలస,** అప్పిలెంట్ తరపు న్యాయవాదులు
"అపరాజిత" 4/19 బ్రాడీపేట, గుంటూరు.సెల్: 9440260814

# ఎంఎస్ఎంఇలకు కేంద్ర ప్రోత్సాహం

విజయకుమార్‌ను సత్కరిస్తున్న ఎంఎస్ఎంఇల ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 2012లో కొత్త పాలసీని తీసుకొచ్చిందని ఎంఎస్ఎంఇ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం గాజువాక ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, బయ్యర్స్ అండ్ సెల్లర్స్ మీట్ కమ్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను ఒక వేదికపైకి తీసుకొచ్చి, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మార్కెటింగ్ మద్దతు అందించడమే దీని లక్ష్యమన్నారు. పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ -2012 ప్రకారం, కేంద్ర మంత్రిత్వ విభాగాలు, సిపిఎస్ఇలు తమ వార్షిక కొనుగోళ్లలో కనీసం 25శాతం వస్తువులు, సేవలను ఎంఎస్ఎంఇల నుంచి పొందాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీటిలో నాలుగుశాతం ఎస్‌సి,ఎస్‌టి, మూడుశాతం మహిళల అధీనంలో పరిశ్రమల నుంచి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఎంఎస్ఎంఇలకు తమ తోడ్పాటును హెచ్‌పిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (మెటీరియల్), కె.తిరుమురుగన్, బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యప్రసాద్ ప్రకటించారు. కార్యక్రమంలో వాసవ అధ్యక్షులు వి రాంప్రసాద్, యూకో బ్యాంక్ జనరల్ మేనేజర్ డివి రావు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డిజిఎం స్మిత రేవతి పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఆరు సిపిఎస్ఇ, నాలుగు బ్యాంకులు, 22 ఎంఎస్ఎంఇ లకు చెందిన మొత్తం 32 స్టాల్స్ ఏర్పాటు చేశారు.

## న్యాయం చేయాలని ధర్నా

ఆందోళనకారులతో మాట్లాడుతున్న సిఐ అప్పారావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : చేయని తప్పుకు బాధ్యుడిని చేస్తూ పోలీసు స్టేషన్‌కు పిలిచి విచారించడం వల్లే 92వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన రౌతు ఆనంద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు స్టేషన్‌కు పిలిచి విచారించడం తోపాటు మళ్లీ రావాలని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆనంద్ మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. దీనిపై తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తితోపాటు పోలీసులు బాధ్యత వహించి, తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన చేయడంతో గోపాలపట్నం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. దీనిపై స్పందించిన సిఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ, అందిన ఫిర్యాదు మేరకు విచారించడానికి చట్ట ప్రకారమే పోలీస్‌స్టేషన్‌కు పిలిచా మన్నారు. అంతమాత్రాన ఆత్మహత్య చేసుకుంటే తామెలా బాధ్యులమౌతామన్నారు. తాము ఎవరికీ అన్యాయం చేయలేదని నచ్చజెప్పారు. సమస్య ఉంటే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ఇరువర్గాల కేసులు నమోదు చేశామని, తాము ఎవరి పక్షాన ఉండలేదని స్పష్టం చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

## అనధికార అంతస్తు తొలగింపు

షెడ్‌ను తొలగిస్తున్న జివిఎంసి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పురుషోత్తపురంలో భవనంపై అనధికారికంగా నిర్మిస్తున్న షెడ్‌ను సోమవారం టౌన్‌ప్లానింగ్ ఎసిపి ఆదేశాల మేరకు టిపిఎస్ గోపన్న సిబ్బందితో వెళ్లి సోమవారం తొలగించారు. అనధికార నిర్మాణంపై జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు కూటమి నాయకులు ఫిర్యాదు చేయగా, దానిపై స్పందించి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టిపిఎస్ గోపన్న మాట్లాడుతూ, జివిఎంసి అనుమతితోనే ప్లాన్ అప్రూవల్ తీసుకుని ప్రతిఒక్కరూ నిర్మాణాలను చేపట్టాలని, అనధికార నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కాగా భవనం పైఅంతస్తులో షెడ్ తొలగింపుపై వైసిపి నేతలు మండిపడ్డారు. ఇలాంటివే చాలా నిర్మాణాలున్నాయని, వాటన్నింటినీ ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు.

# ఎన్ఆర్ఐ వైద్య కళాశాల స్నాతకోత్సవం

వైద్యపట్టా స్వీకరిస్తున్న ఉత్తమ విద్యార్థిని డాక్టర్ మౌనిక

ప్రజాశక్తి -తగరపువలస :స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ వైద్యకళాశాలలో 2019-20 బ్యాచ్ వైద్యవిద్యార్థుల కోర్సు పూర్తయిన సందర్భంగా సోమవారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. స్నాతకోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ, సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ప్రతి అంశాన్నీ సానుకూల దృక్పథంతో చూసి, మానవీయయ, హుందాతనం, కఠోర శ్రమతో ప్రజల్లో మంచి గుర్తింపు పొందవచ్చన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిసా సూక్తి ఆచరణీయం కావాలని, రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో వైద్య కళాశాల సిఇఒ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఒ పి శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీధర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కృష్ణమూర్తి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా దేవి, వివిధ విభాగాల అధిపతులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యవిద్య పూర్తిచేసుకున్న 123 మందికి డాక్టర్ నాగేశ్వరరెడ్డి , కళాశాల సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి వైద్య పట్టాలు అందజేశారు. ప్రతిభ కనబరిన 16 మందికి బంగారుపతకాలు అందజేశారు. ఉత్తమ విద్యార్థిని గా డాక్టర్ మౌనికను ప్రత్యేకంగా అభినందించారు.

## కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

టెన్నిస్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తిరుపతి జిల్లాలో ఇటీవల జరిగిన 12వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ టెన్నిస్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 14 మంది 8,9 తరగతుల విద్యార్థినిలు మంచి ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు.

## ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

మాట్లాడుతున్న గోపాలరావు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వ భూములు, పోరంబోకు స్థలాల దురాక్రమణదారులపై రెవెన్యూ యంత్రాంగం ఉదాసీన వైఖరి వీడాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, భీమిలి మండలం తాటితూరులో ఎకరాకు పైగా గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు లేవని ఆరోపించారు. ఆక్రమించిన స్థలంలో ప్రహరీ, పార్కు, రోడ్డు నిర్మించినా అధికారులు చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసిన విఆర్ఒ, సర్వేయర్ సమగ్ర నివేదిక ఇవ్వలేదని, బాధ్యులపై ఇంతవరకు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్నిబాబు, పట్టణ అధ్యక్షులు ఉప్పాడ దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు బోని నరసింగరావు, దళిత సంఘం నాయకులు కె సన్యాసిరావు పాల్గొన్నారు.

# తారురోడ్డు పునర్నిర్మించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న సంగివలస గ్రామస్తులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండోవార్డు సంగివలస, పద్మనాభం మండలం సామయ్యవలస మధ్య తారురోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంగివలస గ్రామస్తులు రోడ్డెక్కి, ఆందోళన చేపట్టారు. తాగునీటి సరఫరా పైపులైను ఏర్పాటుకు ఏడాది క్రితం తారురోడ్డును తవ్వి వదిలేశారని, దీనిపై అనేకమార్లు జివిఎంసి అధికారులకు విన్నవించగా, తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో పదేపదే అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు చోడిపల్లి సాయి జైశంకర్, ఊళ్ల దుర్గారావు, కోల అప్పారావు, మేడ అప్పల స్వామి వాపోయారు. తాత్కాలిక మరమ్మతులతో అటుగా వెళ్తున్న భారీ వాహనాలతో రోడ్డు వెంబడి దుమ్ము, ధూళి ఎగిరి కళ్లల్లో పడుతోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులతోపాటు ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడక తప్పడం లేదని వాపోయారు. ఇక వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలు కష్టమేనని, ముఖ్యంగా బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జివిఎంసి ఒకటో జోన్ అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఈ మార్గంలో తారురోడ్డును పునర్నిర్మించాలని కోరారు .

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

ప్రజాశక్తి -పద్మనాభం : పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని బిజెపి మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంతెన మురళీనాగ పరశురామరాజు నుంచి నియామక పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగమణి పరిచయ కార్యక్రమం జరిగింది. పార్టీ వైద్య విభాగ రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అయినాడ, పెంట, అనంతవరం, రెడ్డిపల్లి, చిన్నాపురం పాండ్రంగి రేవిడి గ్రామాల నుంచి పలువురు బిజెపిలో చేరారు.

## గీతం వర్సిటీని సందర్శించిన యుఎన్‌సిడబ్ల్యు బృందం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ప్రతినిధి బృందం సోమవారం సందర్శించింది. బోధన, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించింది. అమెరికన్ బృందంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అశ్విని కె. వోలెటి, అసిస్టెంట్ ప్రోవోస్ట్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఈ-లెర్నింగ్‌చ ప్రొఫెసర్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షనల్ టెక్నాలజీ ప్రొఫెసర్ జెరెమీ డికర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుఎన్‌సిడబ్ల్యు ప్రతినిధులు గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎరోల్ డిసోజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ పాఠశాలల డీన్లతో చర్చలలో పాల్గొన్నారు. ముఖ్యంగా సహపరిశోధన కార్యక్రమాలు, అధ్యాపకుల మార్పిడి ప్రోగ్రామ్‌లు, సంయుక్త అకడమిక్ కార్యక్రమాలు వంటి పరస్పర ప్రయోజనకరమైన అంశాలపై చర్చించారు.ఈ సందర్శన ద్వారా గీతం వర్సిటీ, యుఎన్‌సిడబ్ల్యు మధ్య అంతర్జాతీయ భాగస్వామ్యం బలోపేతం, భవిష్యత్తులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అనేక ప్రయోజనాలను అందించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

# ఎంఎస్ఎంఇ భవనం ప్రారంభించేదెన్నడో?

నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని ఎంఎస్ఎంఇ భవనం

- నిర్మాణం పూర్తయినా రెండేళ్లుగా నిరుపయోగం
- పురాతన భవనంలో సేవలకు ఇబ్బందులు
- సొంత భవనమున్నా తప్పని అవస్థలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ డి బ్లాక్‌లో నిర్మించిన ఎంఎస్ఎంఇ భవనం నిరుపయోగంగా ఉంది. నిర్మాణంపూర్తయి రెండేళ్ళ గడిచినా, నేటికీ ప్రారంభించలేదు. కోట్లాది రూపాయలు వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో అవసరమైన ఫర్నిచర్, ఇతర సౌకర్యాలను సమకూర్చినప్పటికీ, ప్రారంభించి వినియోగంలోకి తేకపోవడంతో అవన్నీ ఖాళీగానే ఉన్నాయి. దీంతో రెండేళ్లుగా వీటి నిర్వహణ భారం మాత్రం తప్పడం లేదు. ఈ భవనాన్ని ఎప్పుడు ప్రారంభించి వినియోగంలోకి తెస్తారో ఎవరికీ స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ఢిల్లీ నుంచి సంబంధిత శాఖ మంత్రిగానీ, అధికారుల బృందంగానీ వచ్చి దీన్ని ప్రారంభిస్తారని ఎదురుచూస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది.

దీంతో ప్రస్తుతం ఎంఎస్ఎంఇ కార్యాలయ కార్యకలాపాలను పాతకాలం నాటి భవనంలో అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతూ నిర్వహిస్తున్నారు. సొంతంగా నిర్మించిన కొత్తభవనంలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, ఏళ్లతరబడి అది ప్రారంభించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఎంఎస్ఎంఇ విభాగం అధికారులు ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ప్రాచీన సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం

## పుస్తకావిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

పుస్తకాల ఆవిష్కరణలో ప్రముఖులతో ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రపంచ మౌళిక సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం ఉందని పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఆచార్య రామకృష్ణ కన్నడ మూలానికి వివిన మూర్తి తెలుగు అనువాదం కొబడ్‌గాంధీ, ఇంగ్లీష్ ప్రతికి తెలుగు అనువాదం 'బీటలు వారిన స్వేచ్ఛ', అలాగే పద్మజ షా, వివిన మూర్తి విరచిత 'వాడు-నేను' మూడు పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈసందర్భంగా ఎంవివి శర్మ మాట్లాడుతూ రుగ్వేదాన్ని మత గ్రంథంగానే చూసే, నేటి ప్రధాన ప్రవంతి ఒరవడికి భిన్నంగా, దీన్ని చరిత్ర, మానవ, నరవర్గీకరణ, సామాజిక, తత్వ, దైవ, సౌందర్యశాస్త్రాలాంటి బహుముఖ కోణాల్లో విశ్లేషణ చేస్తే నాటి సమకాలీన సమాజం, దాని సంక్లిష్టత, బహుముఖ రూపాలు, పరస్పరాశ్రిత సంబంధాలను అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక ప్రాచీన సంకలనాన్ని ఏవిధంగా అధ్యయనం చేయాలనే విధానానికి నమూనాగా నిలిచిన రుగ్వేద యథార్థ దర్శనం పుస్తకాన్ని చదవాలని కోరారు.

'బీటలు వారిన స్వేచ్ఛ' అనువాద రచయిత పద్మజషా మాట్లాడుతూ మనిషి మనుగడకు కూడు, గూడు, నీడలతో నిండైన జీవితాన్ని గడపాలనే సాపేక్షక్రమానికి భిన్నంగా విభేదించిన, అభిప్రాయాలు కలిగిన వ్యక్తి తనకుండాల్సి సాపేక్ష స్వేచ్ఛను కోల్పోతాడనే ఇతివృత్తమే 'బీటలు వారిన స్వేచ్ఛ' గ్రంథమన్నారు. సామాజిక, ఆర్థిక, వైజ్ఞానిక నేపథ్యాన్ని కాదనుకొని అర్థశతాబ్దం సహోదరుల కోసం నాలుగు దశాబ్దాలు నిస్వార్థంగా శ్రమించిన వ్యక్తి, నిష్కారణంగా జైలుపాలై, దశాబ్దం తర్వాత నిరపరాధిగా బయటపడిన సామాజిక మేధోజీవి రాజకీయ జ్ఞాపకాల దొంతరే కోబడ్‌గాంధీ పుస్తకమన్నారు. స్వేచ్ఛ కోసం పరితపించే ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమిదన్నారు.

'వాడు నేను' పుస్తక రచయిత వివిన మూర్తి మాట్లాడుతూ 'వాడి ఊరికి, నా వాడకు అరమైలు దూరం... వాడికి నాకు వేల సంవత్సరాల దూరం' అనే వాక్యాలతో ప్రారంభమయ్యే ఈ నవల, భారతదేశంలో గడచిన ఆరు దశాబ్దాల్లో సాగిన దళిత సమస్యలతో పాటు మనిషి, సమాజం, ఆస్తి, పెళ్లి, రాజ్యం, చట్టం, జాతి, మతం, కులం, ఆధిక్యత, న్యూనత వంటి మౌలికమైన అంశాలను, వివిధ పరిణామాలను చర్చకు పెడుతుందన్నారు. భువనగిరి, చంద్రశేకర్, కాలేకూరి ప్రసాద్, కవన శర్మ గురించి అనేకేళ్లుగా తాను తాను చేసుకున్న ఆలోచనలే ఈ రచనకు బీజమన్నారు. ఆ ముగ్గురి అమరుల గురించి కాస్త తెలిసిన ఎవ్వరికైనా ఈ నవల సాగే క్రమం తెలుస్తుందన్నారు. దళిత సమస్యను కమ్యూనిస్టులు పట్టించు కోలేదనే చర్చ, కమ్యూనిస్టు ఆలోచనల పట్ల దళిత వర్గం ఆలోచనా తీరు సరిగా లేదనే మరో చర్చతో పాటు భవిష్యత్ ఎలా ఉండాలనే ఆలోచనల మేళవింపుపై ఆసక్తి ఉన్నవారంతా వాడు-నేనూ నవలను చదువాలన్నారు.

కార్యక్రమంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా మూడు పుస్తకాల గురించి నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఎస్ అంజయ్య వివరించారు. రుగ్వేదం యదార్థ దర్శనం పుస్తకాన్ని వృద్ధుల కల్యాణ రామారావు, ఎంవిఎస్ శర్మ, బీటలు వారిన స్వేచ్ఛ పుస్తకాన్ని కె ఎస్ మల్లీశ్వరి, కె మురళి, వాడు నేను పుస్తకాన్ని మందలపర్తి కిషోర్, జి ఎస్ రాంమోహన్ సమీక్ష చేశారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ఆచార్య గాయత్రి, ఎ వనజ, కత్తి పద్మ, డి లలిత, ఎన్ గోవిందరాజులు, ఎంఎన్ పట్నాయక్, జివిఎం రెడ్డి, వై కొండయ్య, సాహితీ ప్రేమికులు పాల్గొన్నారు.

## సెంట్రల్ జైలును సందర్శించిన ట్రైనీలు

శిక్షణ జైలర్స్‌తో సమావేశమైన సూపరెంటెండెంట్ మహేష్‌బాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : తమిళనాడు విల్లూరులోని అకాడమీ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరప్షనల్ అడ్మిస్ట్రేషన్ (అప్కా)లో శిక్షణ పొందుతున్న 39 మంది జైలర్స్, అసిస్టెంట్ జైలర్స్ బృందం సోమవారం విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా సెంట్రల్‌జైలును సందర్శించిన ట్రైనీలు, ముందుగా జైలు అంతా కలియతిరిగారు. జైలు పరిపాలనా విభాగం పనులు, ఖైదీల దినచర్య, మహిళా ఖైదీల బ్యారక్‌లు, వారి దినచర్య, జైలు అధికారులు, సిబ్బంది విధులు, బాధ్యతలు మున్నగు విషయాలను సెంట్రల్ జైలు సూపరెంటెండెంట్ ఎం.మహేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఖైదీల సంక్షేమం, జైల్లో నిర్వహిస్తున్న వివిధ పరిశ్రమలు, వాటిలో పనిచేస్తున్న ఖైదీల పనితీరు, జైల్లో ఖైదీలకు అందిస్తున్న విద్య, ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీల్లో పరివర్తనకు తీసుకుంటున్న చర్యలు, వారికి కల్పిస్తున్న అవకాశాలు, జైలు నుంచి బయటకు వెళ్లేటప్పుడు వారికి పునరావాసం వంటి విషయాలపై అవగాహన చేసుకున్నారు. అనంతరం జైలు సమావేశ మందిరంలో ట్రైనీ జైలర్స్ సందేహాలను పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు నివృత్తి చేసారు.కార్యక్రమంలో జైలు డిప్యూటీ పర్యవేక్షణాధికారులు ఎన్. సాయిప్రవీణ్, కె.జవహర్‌బాబు, సిహెచ్.సూర్య కుమార్, జైలు అధికారులు పాల్గొన్నారు.

## అమర్‌ను కలిసిన వైసిపి నేతలు

మాజీ మంత్రి అమర్‌ను అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను మిందిలోని అతని స్వగృహంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, వైస్ ప్రెసిడెంట్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మనలత జోబ్‌దాస్, మండల పార్టీ అధ్యక్షుడు గొరపల్లి శ్రీను,పెందుర్తి వైస్ ఎంపిపి చిరికి దేవుడు, శివ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, సత్కరించారు. పెందుర్తి నియోజకవర్గంలోని సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అమర్‌నాథ్‌తో చర్చించారు.

## ఇంటింటా వైద్యసేవలు

ఎస్‌సి కాలనీలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 72వ వార్డు చినగంట్యాడ ఎస్‌సి కాలనీలో గాజువాక పిహెచ్‌సి వైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటా ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించారు. కేన్సర్, బిపి, సుగర్ వంటి వ్యాధుల లక్షణాలను వివరిస్తూ, ఆయా వ్యాధుల ప్రాథమిక లక్షణాలను ఉన్నవారికి గుర్తించి, వారికి సరైన వైద్యసేవలకు రిఫర్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గాజువాక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటివరకు 9844 మందికి ఇంటింటికే వెళ్లి సర్వే చేశామని, వారిలో కేవలం ముగ్గురికి సర్వైకల్ కేన్సర్ లక్షణాలున్నట్టు గుర్తించి, తగు వైద్యపరీక్షలకు రిఫర్ చేశామన్నారు కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ నాగా అప్పారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# మెమో 57అమలులో జాప్యమెందుకు?

## పాత పెన్షన్ అమలు చేయాలి : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సమావేశానికి హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర నేతలు

ప్రజాశక్తి- గాజువాక : 2004 సెప్టెంబర్ ఒకటి కంటే ముందు ఉద్యోగ ప్రకటన ఇచ్చి, 2004 తర్వాత నియామక ప్రక్రియ పూర్తయిన దాదాపు పది వేలమంది ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 మెమోను తక్షణమే అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం గాజువాక, పెద్ద గంట్యాడ మండలాల యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2004 సెప్టెంబరు తర్వాత నియమితులైన వారికి సిపిఎస్ అమలు చేస్తోందన్నారు. నోటిఫికేషన్ ముందుగానే ఇచ్చినప్పటికీ, నియామక ప్రక్రియలో జాప్యం వల్ల వీరంతా పాత పెన్షన్‌కు నోచుకోవడం లేదని, వీరికి పాత పెన్షన్ వర్తింపచేయాలని కేంద్ర ప్రభుత్వం 2017లో జారీచేసిన మెమో 57ను గత ప్రభుత్వం అమలు చేయకుండా ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానాన్ని ఎటువంటి చర్చ లేకుండా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, జిఒ 57 అమలులో ఎందుకు తాత్సారం చేస్తుందో చెప్పాలన్నారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ అమలు చేసినంత వేగంగా 57మెమో అమలు చేయకపోవడంలో ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు.యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి .అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎండి. రిజ్వాన్, గాజువాక మండల ప్రధాన కార్యదర్శి నూకరాజు, సీనియర్ నాయకులు చలం, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రవిబాబు, ఎండి అబ్దుల్ హక్ పాల్గొన్నారు..

## త్రోబాల్ పోటీల్లో అవంతి విద్యార్థిని ప్రతిభ

జననిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి

ప్రజాశక్తి - తగరపువలస : తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ కళాశాల బిఎస్‌సి ఫస్టియర్ విద్యార్థిని సుంకర జనని తృతీయ స్థానంలో నిలిచినట్లు అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన జననిని సోమవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి రామకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, పిఇటి చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు

## మాతృ మరణాలను అరికట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో మాతృ మరణాలకు ఆస్కారమీయరాదని డిఎంహెచ్‌ఒ డాక్టర్ .పి.జగదీశ్వర రావు హెచ్చరించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై జిల్లాస్థాయి ఎంసిహెచ్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ రేవిడి పిహెచ్‌సి పరిధిలోని పద్మనాథం మండలం రెడ్డిపల్లి గ్రామంలో జనవరిలో మాతృమరణం జరిగిందని, అలాంటివి పునరావృతం కారాదని అక్కడి వైద్యాధికారి, హెచ్‌వి, ఎఎన్‌ఎంలను హెచ్చరించారు. కెజిహెచ్, విజిహెచ్ గైనకాలజిస్టులు మాట్లాడుతూ, హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించి గర్భిణులకు తగిన వైద్య సలహాలు అందించాలని సూచించారు.

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బందికి ప్రెగ్నెన్సీ విషయం తెలిసిన వెంటనేవారి పేర్లు నమోదుతోపాటు వ్యాక్సినేషన్, మందులతోపాటు ప్రసవం వరకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి, డిఐఒ డాక్టర్ లూసీ, విజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ .ఉషాప్రసాద్, డాక్టర్ హెచ్‌ఆర్‌కె.దొర, కెజిహెచ్ గైనకాలజిస్టులు డాక్టర్ .షర్మిలా కుమారి, డాక్టర్,శ్రీదేవి, జనరల్‌మెడిషన్ వైద్యులు డాక్టర్ వర్తిక, ఎనిస్థీసియాలజిస్ట్ డాక్టర్.జివి గణేష్, డిఐఎంఒ బి.నాగేశ్వరరావు, ఐసిడిఎస్ నోడల్ అధికారి, త్రినాధ రావు, 108 సేవలు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్,.ఐ.మనోరమ, డిపిహెచ్‌ఎన్‌ఒ డాక్టర్ కె.స్వప్న, రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి, రెడ్డిపల్లి హెచ్‌వి, ఎఎన్‌ఎం పాల్గొన్నారు.

# కంటి కేన్సర్‌పై అవగాహన అవసరం

## ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల కంటి వైద్యనిపుణులు డాక్టర్ లావణ్య

డాక్టర్ లావణ్య

ప్రజాశక్తి - ఆరిలోవ :కంటి కేన్సర్ అరుదైనదైనప్పటికీ త్వరితంగా గుర్తించకపోతే అది ప్రాణాంతకం కావచ్చని, పూర్తిగా కంటిని తీసి వేయడానికి దారితీయవచ్చని ఎల్‌వి. ప్రసాద్ కంటి వైద్యశాల, జిఎంఆర్ వరలక్ష్మీ ఇనిస్టిట్యూట్ నేత్రవైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య అన్నారు. అవగాహన లోపంతో చాలా కంటికేన్సర్ కేసులు తొలిదశలో కాకుండా తీవ్రమైన తర్వాత గుర్తిస్తారన్నారు ప్రపంచ వ్యాప్తంగానూ, మనదేశంలోనూ బాల్య కంటి కేన్సర్ కేసులు వెలుగుచూస్తున్నాయన్నారు. ప్రాణాంతకమైన కంటి కేన్సర్ రెటినో బ్లాస్టోమా ఇతర దేశాల కంటే భారతదేశంలో ఎక్కువగా ఉందన్నారు. కంటి కేన్సర్ లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవచ్చని, ఇది క్రమబద్ధకమైన కంటి పరీక్షల్లో బయటపడతాయన్నారు.

పిల్లల కంటిలో ఒక తెల్లని ప్రతిబింబం, చెదిరిన చూపు, ఉన్నట్టుండి చూపుపోవడం, ఐరిస్‌పై నల్లని లేదా పెరుగుతున్న మచ్చ, ఒక కన్ను ఉబ్బడం, కంటి ఆకారంలో ఉన్నట్టుండి మార్పు, కనురెప్ప, కంటి చుట్టూ గడ్డ, కంటి ఎరుపుదనం, దీర్ఘకాలికంగా చికాకుగా ఉండడం వంటివి కంటి కేన్సర్ లక్షణాలు కావచ్చన్నారు. ఆయా లక్షణాలుంటే వెంటనే కంటి పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఏటా మే నెలలో రెటినో బ్లాస్టోమా వారోత్సవాల్లో భాగంగా కంటికేన్సర్ వ్యాధి గుర్తింపు, చికిత్సపై అవగాహన, నిధులు సమీకరణకు ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాటిని కంటి రోగులు, దృష్టిలోపం ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

**- రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలుచేయాలి**

**- వాలాబులో రైతుల ఆందోళన**

ప్రజాశక్తి-దేవరాపల్లి

జీడి పంటకు మద్దతు ధరపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం చేయాలని, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా పిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దేవరాపల్లి మండలం వాలాబు గ్రామంలో జీడి మామిడి రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ కొన్ని రకాల వాణిజ్య పంటలకు మద్దతు ధర ప్రకటించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీడి పంటకు నిర్ణయించకపోవడం శోచనీయమన్నారు. దీంతో దళారుల చేతిలో రైతులను దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాను వ్యాపారులు రూ.7వేలకు మించి కొనుగోలు చేయడం లేదని, ఒక బస్తా పిక్కలు ప్రాసెసింగ్‌కు రూ.2వేలు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఒక బస్తా జీడి పిక్కల నుండి 25 కేజీల పప్పు వస్తుందని, కేజీ పప్పు ధర రూ.800 ఉందని, ఈ లెక్కన ఒక బస్తా పిక్కలు వలన రూ.20 వేలు ఆదాయం వస్తుందని తెలిపారు. దీంతో పాటు జీడి తొక్క, నూక, ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులు ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. కాని ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో ఇటు రైతులు, అటు వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. అందువల్ల 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంట విస్తరణ, నిర్వహణకు రాయితీలు పునరుద్ధరించాలని, ఈ-క్రాప్ నమోదు చేయాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ దేముడు, డి శంకర్, బి నాగేశ్వరరావు, డి దాసు, కె సుదర్శన్, కె రామాస్వామి, ఇ గోపాలుడు, పి శ్రీరామ్, మామిడి దేముడు, గూట్ల దేముడు, చేదల ఎరకన్నదొర, పి.మహాలక్ష్మి, అధిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

వాలాబులో ఆందోళన చేస్తున్న జీడి రైతులు



వినతిపత్రం ఇస్తున్న బ్రహ్మాజీ, మహిళలు

## వెలుగు సీసీ నిర్మలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మండలంలోని చూచుకొండ గ్రామ వెలుగు సీసీ నిర్మలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు .ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో కలిసి ఏపీఎం బాలరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ మండలంలోని చూచుకొండ గ్రామంలో 11 మంది సభ్యులతో ఉన్న గణేష్ ఎస్ఎల్‌జి గ్రూపు సభ్యులు 2024కు ముందు తమ అవసరాల నిమిత్తం రుణం తీసుకున్నారని తెలిపారు. అందులో ఇద్దరు మహిళలు మిగిలిన 9 మంది సభ్యుల నుండి డబ్బులు వసూలు చేసి బ్యాంకుకు చెల్లించకుండా ఏడు నెలలగా తప్పించుకు తిరుగుతున్నారని పేర్కొన్నారు. గ్రూపు సభ్యులు గ్రామ పెద్దలు సమక్షంలో వీరిని నిలదీయడంతో వాడుకున్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించడంతో మిగిలిన సభ్యులు వారిని గ్రూపు నుండి తొలగించినట్లు చెప్పారు. అనంతరం 2024 సంవత్సర కాలంలో కొత్త సభ్యులను గ్రూపులో చేర్చుకొని మరల రుణాన్ని మంజూరు చేయాలని గ్రామ సిసి నిర్మల వద్దకు వెళ్లగా..., ఏపీఎం బాలరాజు రుణాన్ని మంజూరు చేయవద్దని చెప్పారని ఆమె అన్నారని తెలిపారు. అంతేకాకుండా గ్రూప్ సభ్యుల పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిపై ఎపిఎం బాలరాజు స్పందిస్తూ సిసి ఎప్పుడు ఆ విషయం తన ముందుకు తీసుకురాలేదని తెలిపారు. తొలగించిన ఇద్దరు సభ్యులతో కుమ్మక్కై గ్రూపు సభ్యుల రుణ మంజూరుకు అడ్డుపడుతున్న నిర్మలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌జి గ్రూప్ సభ్యులు ఆడారి రామలక్ష్మి, కాండ్రేగుల తులసి, కృష్ణవేణి, సూరి సత్యవతి, కే లక్ష్మి, చదరం వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య జాతర రాట మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నూకంబిక అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 28, 29 కొత్త అమావాస్య జాతరకు సంబంధించిన ముహూర్తం రాట మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. రాటకు ప్రత్యేక పూజలు చేసి రాటను వేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎన్ సుజాత, దేవాదాయ శాఖ డిసి ఆఫీస్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్, సహాయ కమిషనర్ సుధారాణి, ఈవో శేఖర్ బాబు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దిబ్బిడి హైస్కూల్ 61వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 61వ వార్షికోత్సవం సోమవారం ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పీటీసీ దొండా రాంబాబు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. గత సంవత్సరం పది తరగతిలో మెరిట్ విద్యార్థులకు తండ్రి గోదారయ్య జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు.60 ఏళ్ల క్రితం ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన శ్రీపాద కృష్ణమూర్తి పేరు ఈ పాఠశాలకు నామకరణ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. స్టేజీకు రేకుల షెడ్ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సర్పంచ్ పేదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా వెంకటేశ్వరరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ పల్లి అప్పారావు, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, స్థానిక నాయకులు పేదిరెడ్డి రాజు, సేనాపతి శ్రీను, ముమ్మిన నాగరాజు, జెర్రిపోతుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటీసీ సభ్యులు దొండా రాంబాబు

## ఎన్నికల హామీ అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తాము అధికారంలో వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేస్తామన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎపి భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి ఏఓ సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో జీఓ నెంబర్ 17 ద్వారా సంక్షేమ బోర్డ్ నుంచి రూ.1200 కోట్ల నిధులు దారి మళ్లించి సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో చిన్ని సత్తిబాబు, పల్ల నర్సింగరావు, మొల్లి చిలుకు, చిన్ని కొండ బాబు,చొప్ప రాము, చిన్నబాబు, డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన రీ సర్వేలో అనేక తప్పులు వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుత ప్రభుత్వం ఈ సర్వే సమస్యలను పరిష్కరించాలని తురకలపూడి గ్రామస్తులు కోరుతున్నారు. రీ సర్వేలో జరిగిన తప్పులపై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 270 అర్జీలు వచ్చాయని మాజీ ఎంపీటీసీ కోరుకొండ అప్పలనాయుడు తెలిపారు. రీ సర్వేలో ప్రధాన భూమిక వహించే సర్వేయర్లు అధికారులు వేరే ప్రాంతానికి డిప్యూటేషన్‌పై పంపించారని, దీనివల్ల గ్రామంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. తురకలపూడి సచివాలయంలో సర్వేయరును పర్మినెంట్‌గా ఉంచాలని కోరారు.

## దీపం గ్యాస్ పంపిణీపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

**జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి**

మాట్లాడుతున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

దీపం పథకం కింద ప్రజలకు అందించే గ్యాస్ సిలిండర్ల పంపిణీ సమయంలో నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి హెచ్చరించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సివిల్ సప్లయి అధికారులు, గ్యాస్ కంపెనీల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందజేస్తున్న పథకాలపై ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తున్నదని, అందులో భాగంగా దీపం పథకంపై ఐవిఆర్ఎస్ పద్ధతి ద్వారా సేకరించిన అభిప్రాయ సేకరణలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో గ్యాస్ సిలెండర్లు డెలివరీ సిబ్బంది ప్రజలనుండి సిలెండరు ధరకంటే అధికంగా డబ్బులు వసూలు చేయకుండా సంబంధిత డీలర్లు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రతి ఫిర్యాదుకు రూ.5వేలు చొప్పున అపరాధ రుసుం విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్యాస్ డెలివరీ సమయంలో తూనిక యంత్రంతో తూచి లబ్ధిదారునికి అందించాలని, అందుకు గాను తూనికల శాఖ నుండి ఆమోదం పొందిన కాటాలను వినియోగించాలని ఆదేశించారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి సకాలంలో నివేదికలు అందించాలని సివిల్ సప్లయి అధికారులను జాయింటు కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, తూనికలు కొలతల శాఖ సహాయ కంట్రోలర్ బి. రామచంద్రరావు, గ్యాస్ కంపెనీల డీలర్లు, సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

## 25 నుంచి 27 వరకు మద్యం షాపుల బంద్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 25 తేదీ సాయంత్రం నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు డ్రై డేస్ నిమిత్తం మద్యం షాపుల బందు చేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజు మార్చి 3న కూడా మద్యం షాపులు మూసివేయడం జరుగుతుందని వెల్లడించారు.

# నిర్దిష్ట ప్రణాళికతో పెండింగ్ కేసులు పరిష్కరించాలి

**జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా**

ప్రజాశక్తి-అనకాపల్లి

నిర్దిష్ట ప్రణాళికతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని కోరారు. దొంగతనం నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. నేర నియంత్రణకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ ద్వారా రోడ్డు ప్రమాద డేటాను విశ్లేషించి, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో గుర్తుతెలియని మృతదేహాలు, కారణం తెలియని మరణం కేసులు, అనుమానాస్పద మృతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్ఫోర్స్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచిన ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఎస్‌బి సిఐ ఎస్.బాలసూర్యారావు, పాయకరావుపేట సిఐ జి.అప్పన్న, చోడవరం సిఐ పి.అప్పలరాజు, వి.మాడుగుల ఎస్సై జి.నారాయణరావు, రోలుగుంట ఎస్సై పి.రామకృష్ణారావులకు ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, వి.విష్ణు స్వరూప్, పి.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ఎంవి.కృష్ణచైతన్య, ఇన్స్పెక్టర్లు కె.లక్ష్మణమూర్తి, ఎస్.బాల సూర్యారావు, ఎస్సై బి.రమణయ్య, ఎస్.ప్రసాద్, బి.సురేష్ బాబు, జిల్లా సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నేత కుమార్ రాజా

## ముత్యాలమ్మ పండగ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలోని తేగాడ గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం ఆహ్వాన పత్రికను, వాల్ పోస్టర్‌ను వైసిపి నాయకులు మలసాల కుమార్ రాజా అనకాపల్లి రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తేగాడ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, వైసిపి నాయకులు దివాకర్, పెద్దిశెట్టి గోవింద్, కేఏం నాయుడు, టివి.సత్యనారాయణ, దమ్ము జాను, మక్కా సన్యాసిరావు, పడాల నాగేశ్వరావు, గైపూరి రాజు, కాండ్రేగుల రాము, శ్రీధరాల మనోజ్, పి.సన్యాసిరావు, సూరిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

## ఆదర్శ రైతు నాగేశ్వరరావుకు సన్మానం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కర్రి నాగేశ్వరరావును గ్రామంలో సోమవారం బీసీటీ ప్రతినిధులు సాలువ కప్పి సత్కరించారు. నాగేశ్వరరావు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఉత్పత్తి సాధిస్తున్నారని బిసిటి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తెలిపారు. నాగేశ్వరరావు అవలంబిస్తున్న వ్యవసాయ పద్ధతులను రైతులు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు.

## నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌కు నలుగురు ఎంపిక

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌కు తమ పాఠశాల నుండి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బోకం సన్నిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ప్రకృతి కుశ్వంత్ కుమార్, పాత్రపల్లి కులశేఖర్, బోని జానకి, ఆడారి పూజ ఎంపికైనట్లు తెలిపారు. తమ హైస్కూల్లో మంచి విద్యతో పాటు చక్కని క్రమశిక్షణ ఉపాధ్యాయుల కృషితో ఇది సాధ్యమైందని, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధి కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ ప్రతినెలలాగే హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం 30 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ 5 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనకరాజు చేతుల మీదుగా అందజేశారు. ప్రతి నెలా నిత్యావసర సరుకులు ఇస్తున్న గ్రేస్ అఫ్ గాడ్ ట్రస్టు చైర్మన్ విజయ్ కుమార్‌ను అభినందించారు. విశాఖపట్నం భగవాన్ హోల్సేల్ గిఫ్ట్ షాప్ యజమాని బిఆర్.చౌదరి 30 మందికి చాపలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణమ్మ, జ్యోతమ్మ, హేమలత, ఈశ్వరమ్మ, సిస్టర్ విజయ్ గ్రేస్, బ్రదర్ ఇస్సాకు, మ్యాత్యు, నాయుడు, దివ్య తేజ, రమ్య, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న కనకరాజు

# ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలి

## రెండో విడత శిక్షణలో కలెక్టర్ విజయకృష్ణన్

**ప్రజాశక్తి-అనకాపల్లి**

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియపై పీఓలు, ఏపీఓలు పూర్తి అవగాహన కల్పించుకొని ఎన్నికల విధులను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. ఈ నెల 27న జిల్లాలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై సెక్టారు అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగు సిబ్బందికి సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ పద్ధతిన జరిగే ఈ ప్రక్రియలో సంయమనం పాటిస్తూ, సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని తెలిపారు. పోలింగ్ సామాగ్రి స్వీకరణ అనంతరం తమ బృందంతో కలిసి నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. చిన్న తప్పిదానికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో 2885 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత వరుసలో గల ఓటర్లకు టోకెను ఇచ్చి ఓటింగు పక్రియ పూర్తిచేయాలని తెలిపారు. పోలింగు కేంద్రంలో ప్రిసైడింగు అధికారి ఆదేశాలను సిబ్బంది తప్పని సరిగా పాటించాలన్నారు. పోలింగు అనంతరం బ్యాలెట్ బాక్సులు, సామగ్రిని జాగ్రత్తంగా సీలు చేసి జివియంసి హైస్కూలు నందు ఏర్పాటు చేసిన రిసెప్షనులో జాగ్రత్తగా అందజేయాలని కోరారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

### మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల నేపథ్యంలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల్లో నిర్వర్తించవలసిన విధులపై క్షుణ్ణంగా వివరించారు. పరిశీలకులు ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించవలసి ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడటమే కాకుండా, ఉల్లంఘన జరిగితే, ఆ సమాచారాన్ని సీల్డ్ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగు ప్రక్రియలో కలుగజేసుకోకూడదని స్పష్టం చేశారు. పోలింగు నిర్ణీత సమయానికి ప్రారంభించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు ఖాళీగా ఉన్న విషయాన్ని ఏజెంట్లు సమక్షంలోనే నిర్ధారించుకొని, పోలింగు ప్రారంభించాలని సూచించారు. జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, డిపిఆర్‌సి జిల్లా కోర్డినేటరు నాగలక్ష్మి, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రెండు శిక్షణా కార్యక్రమాల్లో ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు ఎస్‌విఎస్‌ఎస్.నాయుడు, డిప్యూటీ తహాశీల్దారు పి.అరుణచంద్ర ఎన్నికల నిబంధనలు, పోలింగు విధానం, బ్యాలెట్ బాక్సులు నిర్వహణపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికలు విధులు కేటాయించబడ్డ 12 మంది సెక్టారు అధికారులు, 58 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 76 మంది ఇతర పోలింగు సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి

మాట్లాడుతున్న మురళీమోహన్ పట్నాయక్

**ప్రజాశక్తి-చోడవరం**

జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో వినియోగించి పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని అనకాపల్లి జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి మురళీ మోహన్ పట్నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఐదు రోజులుగా జరుగుచున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ లేక ప్రీ స్కూల్‌లో ఉన్న పిల్లల వయస్సును పూర్వ ప్రాథమిక పాఠశాల దశగా గుర్తించి ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లలు భవిష్యత్తులో వారు చదవబోయే విద్యకు సంబంధించిన బలమైన పునాదులను ఇక్కడే ఏర్పర్చుకుంటారన్నారు. వారు చదవడం, రాయడం, ఇతరులతో సంభాషించడం, భాషను అభివృద్ధి చేసుకుంటూ భావోద్వేగాలను అదుపు చేసుకొని తోటి బాలలతో కలిసి మెలిసి ఉండడాన్ని నేర్చుకుంటారని తెలిపారు. ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సింహాచలం, పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు, ఐసిడియస్ సూపర్ వైజర్లు అనిత, శ్రీదేవి, సురేష్, రవి, గణేష్, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** పిల్లలకు మెరుగైన విద్యను అందించడం కోసం ప్రతి అంగన్వాడీ కార్యకర్త బాధ్యతగా మెలగాలని ఎంఇఒలు బి.పడాల్ దాసు, వి.ఉషారాణి అన్నారు. మండలంలోని కాశీపురం జెడ్పీ హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను సోమవారం వారు పరిశీలించారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ కె. సుభాష్ చంద్ర, కె. సుధాకర్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ డిఆర్పిలు కళ్యాణి, ఆదిలక్ష్మి, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మార్చిలో జరిగే పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షా సమయంలో ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతికి ఎఐఎస్‌ఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణింద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష సమయంలో ప్రైవేట్ వాహనాలు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేసే అవకాశం ఉందని, ఆ చార్జీల భారం వల్ల కొంత మంది విద్యార్థులు పరీక్షలకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.రాజు, శ్రీను, సింహాద్రి, జగదీష్ పాల్గొన్నారు.

## 27న టీచర్లకు క్యాజువల్ లీవ్ మంజూరు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో పనిచేస్తూ జిల్లాలో ఓటర్లుగా నమోదు చేసుకున్న ఉపాధ్యాయులకు పోలింగ్ రోజున అనగా 27న ప్రత్యేక క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల యాజమాన్యాలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసిన అనకాపల్లి, జివిఎంసి హైస్కూలు, జిల్లాలో పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేసిన కళాశాలలు/పాఠశాలలకు 26, 27 తేదీలలో రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు.

## కిషోర్‌ను కలిసిన వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కశింకోట :** వైసిపి కసింకోట మండల అధ్యక్షులుగా రెండోసారి నియమితులైన మలసాల కిషోర్‌ను చింతలపాలెం వైస్సార్సీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ శ్రీను, బుదిరెడ్డి బాబురావు, చిత్తూరు అప్పారావు, కోన శ్రీను, షేక్ రెహమాన్, శాంతరాజు, బాబురావు ఉన్నారు.

## బౌద్ధ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మార్చి 9వ తేదీన జరగనున్న బౌద్ధ సమ్మేళనం ఆహ్వాన కరపత్రాన్ని సోమవారం మాజీ ఎమ్‌పి డాక్టర్ బివి.సత్యవతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కమిటీ సభ్యులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బొజ్జన్న కొండ వద్ద ఈ సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ ప్రతినిధులు పల్లా బాబ్జీ, బండి అప్పారావు, శరగడం శ్రీనివాసరావు, వినకోట నీలేషగుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

## శివాలయం నిర్మాణానికి విరాళాలు

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన దంగేటి సంతోష్ గుప్తా రూ.21,116, పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన సబ్బవరపు సత్యనారాయణ (లాయర్) రూ.72,116 విరాళాలు ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, పాల్గొన్నారు.

## కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు

**ప్రజాశక్తి-యలమంచిలి :** యలమంచిలి మెయిన్‌రోడ్డులో 11 కెవి కొత్త విద్యుత్‌లైన్ ఏర్పాటుకు భారీ విద్యుత్ స్తంభాలు నెలకొల్పుతున్నారు. సోమవారం ప్రధాన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభాలను ఆయా ప్రాంతాలకు తరలించారు. బైపాస్ రోడ్డు మొదలు కొని అయ్యప్ప టెంపుల్ ప్రాంతం వరకు కొత్త స్తంభాలను నిర్మించారు. రానున్న వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఈ కొత్త లైన్ ఉపయోగపడుతుందని విద్యుత్ ఏఈ కనకరాజు తెలిపారు.

## నూకాంబిక ఆలయంలో వంటశాల ప్రారంభం

**ప్రజాశక్తి-యలమంచిలి :** యలమంచిలి బస్టాండ్ సమీపంలో ఉన్న నూకాంబిక ఆలయంలో నూతనంగా నిర్మించిన వంటశాలను దాత కర్రి ధనరెడ్డి సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఈ వంటశాలను నిర్మించారు. అమ్మవారి ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందని ధనరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపు గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వంటశాలను ప్రారంభిస్తున్న కర్రి ధనరెడ్డి

# నర్సీపట్నంలో ఉద్రిక్తత

**-వైసిపి నేత భవనం కూల్చివేతకు యత్నం**
**- భారీగా పోలీసులు, పార్టీ నేతలు**
**- హైకోర్టు స్టే విధించడంతో విరమించిన అధికారులు**

భవనాన్ని కూల గొట్టిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**నర్సీపట్నంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కర్రి శ్రీనివాసరావుకు చెందిన భవనం కూల్చివేతకు సోమవారం నర్సీపట్నం తహశీల్దార్ రామారావు ఆధ్వర్యంలో, పోలీసుల బందోబస్తు మధ్య భవనం కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు. ఉదయం 7 గంటలకు కూల్చివేత పనులను ప్రారంభించారు. ఉదయం 10:45 గంటలకు కూల్చివేత పనులు నిలిపివేయమని హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. ఈ విషయాన్ని నర్సీపట్నం తహశీల్దార్ రామారావు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కూల్చివేత పనులు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు భవనం కూల్చివేత సమయంలో రెవెన్యూ, పోలీస్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య హైడ్రామా నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అయ్యరక కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావుకు చెందిన భవనం కూల్చి వేతకు పెద్ద సంఖ్యలో పోలీస్ బలగాలు, రెవెన్యూ సిబ్బంది తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా చేరుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. భవనం కూల్చివేతకు మార్కింగ్ ఇవ్వడం కోసం వచ్చిన నర్సీపట్నం తహసిల్దార్ రామారావుతో, మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, కోర్టు ఆదేశాలు మేరకు భవనాన్ని కూల్చివేస్తామని తహశీల్దార్ చెప్పారు. ఆ వెంటనే కూల్చివేత పనులు ప్రారంభించారు. భవనం లోపల ఉన్న ఫర్నిచర్‌ను రెవెన్యూ సిబ్బంది బయటకు తీస్తుండగా భవన యాజమాని, వైయస్సార్ పార్టీ నాయకులు అడ్డుపడ్డారు. పోలీసుల సహకారంతో సామాగ్రిని బయట పడేశారు. హైకోర్టు స్టే విధించడంతో కూల్చి వేత పనులు అధికారులు విరమించారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ విలేకరులతో మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో ఉండి ఫోన్ ద్వారా ఇక్కడ బిల్డింగ్ కూల్చివేతకు ఆదేశాలు ఇస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిల్లర చేష్టలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నర్సీపట్నంలో అక్రమ కట్టడాలన్నీ తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగాయని, ఇవేమీ కొత్తగా చేసిన నిర్మాణాలు కాదని అన్నారు. ఇప్పటికే నర్సీపట్నంలో ఒక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడి ఇల్లు పడగొట్టారన్నారు. అయ్యరక కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తానే భవనాన్ని తొలగిస్తానని చెప్పినా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒత్తిళ్లకు లొంగిపోయిన అధికారులు గడువు కూడా ఇవ్వకుండా తన భవనాన్ని కూల్చివేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోహరించిన పోలీసులు

విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రాత్రివేళల్లో తొమ్మిది గంటల వరకు విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. హెచ్.ఎమ్ చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రతీరోజు గంటన్నర సమయాన్ని ఆయా సబ్జెక్టులకు కేటాయించి విద్యార్థుల లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారాన్ని అందిస్తున్నారు.రాత్రివేళ ప్రారంభించిన తరగతులలో వెనుకబడిన విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులను ఎ,బి,సి,డి లుగా విభజించి బోధిస్తున్నామన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాశక్తి-గొలుగొండ:**గొలుగొండ మండలం పాత మల్లంపేట పంచాయతీలో ధారమఠం శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తలకు ఇబ్బందులు కలగకుండా నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా జరుగు వేడుకలకు బందోబస్తు, ట్రాఫిక్ నిబంధన గురించి సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై పీ.రామారావు, కేడిపేట ఎస్సై తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలు భద్రపరుస్తున్న అధ్యాపకులు

## నక్కపల్లికి చేరుకున్న ఇంటర్ పరీక్షా పత్రాలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాలు నక్కపల్లి చేరాయి. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీదేవి ఆధ్వర్యంలో పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1 నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల్లో 446 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్షా కేంద్రం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాశక్తి -కోటవురట్ల:**ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు సకాలంలో వారికి వేతనాలు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ కోరారు.సోమవారం ఆయన మండలంలోని చౌడువాడ గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశం అయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలకు ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కల్పించడంతో పాటు సకాలంలో వారికి వేతనాలు అందజేయాలని ప్రతికూలికి వంద రోజులు పని సౌకర్యం కల్పించాలని తెలిపారు. బకాయిలు తక్షణమే అందజేయాలన్నారు ఉపాధి పనుల వద్ద మెడికల్ కిట్లు, తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించాలని తెలిపారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

## ఆలయానికి రూ.10 వేల విరాళం

**ప్రజాశక్తి-మాడుగుల:**మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి విశాఖపట్నంకు చేరుకూరు దామోదర రావు, మణి దంపతుల కుమారుడు రోహిత్ కుమార్, కుమార్తె జయశ్రీలు ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు సౌకర్యార్థం 10 వేలు రూపాయలు నగదును సోమవారం ఆలయ కమిటీ చైర్మన్,గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, ముమ్మిన రమణ బాబు,రాయపరెడ్డి కొండలరావు, జాజి మొగ్గల చిరంజీవి, మజ్జి మహేష్, పోతిన జగదీష్ పాల్గొన్నారు.

విరాళం ఇస్తున్న దాతలు

## తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

**ప్రజాశక్తి-నక్కపల్లి:**పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండలంలోని అమలాపురం పంచాయతీ చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద సోమవారం ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డోర్ టు డోర్ తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ప్రజలు బయట చెత్తను వేయకుండా డస్ట్ బిన్ లలో వేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాడి పశువుల ఉన్న రైతుల నుండి పేడ సేకరణ, వర్మి కంపోస్ట్ తయారీ విధానం పై అవగాహన కల్పించారు. చెత్త నుండి సంపద తయారు చేసి పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఈవోపీఆర్డి ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్ అసిస్టెంట్‌లు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ తనిఖీ

**ప్రజాశక్తి-చింతపల్లి:** 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ను ఎంపీడీవో యుఎస్వి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ లో ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించమన్నారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కలిగించామన్నారు. పాఠశాల ప్రాంగణం అలాగే వారి స్వగృహాలలో పరిసరాలు పరిశుభ్రత వంటనీరు వ్యర్థనీటితో కిచెన్ గార్డెన్ టెర్రస్ గార్డెన్ తయారీ విధానం పై అవగాహన కల్పించామన్నారు. మరుగుదొడ్లు లేని వారు కొత్తగా మరుగుదొడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు మత్తు పానీయాలు సేవించకుండా ఉండాలన్నారు. అలాగే ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు వచ్చేవరకు పెళ్లిళ్లు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్

## మోదకొండమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- మాడుగుల:** మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు సమక్షంలో విడుదల చేశారు. తీర్థ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, భీమర శెట్టి పైడియ్య నాయుడు, ఢిల్లీ నానాజీ, పల్లెల రాము, నందారపు రవితేజ, కుప్పిలి భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపమాక వెంకన్న పందిరి రాటోత్సవం

**ప్రజాశక్తి-నక్కపల్లి:**ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం పురస్కరించుకుని సోమవారం ఉదయం 7.50 గంటలకు ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మహోత్సవ పందిరి రాటోత్సవాన్ని అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, గోపాలచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నాయకులు, భక్తుల సమక్షంలో స్వామివారి పెండ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు మార్చి 9వ తేదీ నుండి అంకురార్పణతో ప్రారంభమవుతాయని, 10వ తేదీన ధ్వజారోహణం, రథోత్సవం, కళ్యాణ మహోత్సవం, 17వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్‌లు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, చిలువూరి రామ సూర్యనారాయణ రాజు, గోవిందరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కె నూకరాజు, వైసీపీ నేతలు వీసం రామకృష్ణ, శీరం నరసింహ మూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాటను వేస్తున్న అర్చకులు, నాయకులు

# ఉపాధ్యాయుల సంక్షేమమే నా అజెండా

## -పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

**ప్రజాశక్తి-భోగాపురం, వేపాడ, జామి**

ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే తన అజెండా అని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. సోమవారం భోగాపురం, జామి, వేపాడ మండలాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం చేపట్టారు. భోగాపురం ఉన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, రావాడ, పోలిపల్లి ఉన్నత పాఠశాలల్లోను, జామి జెడ్‌పి ఉన్నత పాఠశాల, వేపాడ మండలంలో కెజిబివి, ఆదర్శ పాఠశాల, గురుకులంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బొద్దాం, సోంపురం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని, కచ్చితంగా వాటి పరిష్కారానికి తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

ఆనందపురంలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

**అవకాశమిస్తే ఉపాధ్యాయుల గొంతునవుతా**

ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే విధాన మండలిలో ఉపాధ్యాయుల గొంతును వినిపిస్తానని విజయగౌరి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై గత కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను దగ్గర నుంచి చూసిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఓటు వేసి గెలిపించినా ఉపయోగం లేదన్నారు. గతంలో పనిచేసిన వారంతా సమస్యను గాలికి వదిలేసి ప్రభుత్వాలకు అనుగుణంగా ఉండడంతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించ లేదని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల విద్యా శాఖలో అపారమైన నష్టం జరిగిందని అన్నారు.

మొదటిసారిగా పెద్దల సభకు ఒక మహిళగా ప్రాతినిధ్యం చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఓటర్లంతా విజయగౌరికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, వేపాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిన్నింటి వెంకటరమణ, ఇమంది జగదీశ్వరరావు, కోశాధికారి పి.చిరంజీవి, సీనియర్ నాయకులు ఎస్‌విఎన్ స్వామి, డి.జగదీష్, ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, భోగాపురం యుటిఎఫ్ నాయకులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైకుంఠరావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

**యుటిఎఫ్ నేతల ప్రచారం**

**ఆనందపురం** : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వేములవలస వివేకానంద జూనియర్ కళాశాల, ఎస్ఎన్‌టి స్కూల్, అనందపురం, వేములవలస పాలవలస గ్రామాల్లో ఉపాధ్యాయ ఓటర్లను వారి ఇళ్లు, కార్యాలయాల వద్దకు వెళ్లి, నేరుగా కలిసి కరపత్రాలను పంచుతూ ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వై భాస్కర్,ఇంటి అర్జున్ పాల్గొన్నారు.

క్రీడాకారులతో కౌన్సెలర్ రాజేష్

## రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**ఈ నెల 20, 21 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ వుషు టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన 12 మంది మహిళా క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరు 28 కేజీల విభాగం నుండి 75 కేజీల విభాగం వరకు వెయిట్ కేటగిరిలో పాల్గొన్నారని సీనియర్ కోచ్ యర్ర శేఖర్ తెలిపారు. టీమ్‌తో పాటు మహిళా ఎన్ఐఎన్, వుషూ కోచ్ వేపాడ ప్రియాంక మహిళా క్రీడాకారులను తీసుకువెళ్లారు. ఇందులో వేపాడ ప్రయాంక 75 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించగా జనుకుల కిరణ్మయి(66 కేజీలు), ఇసారపు నీలిమ(37కేజీల) విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే చెల్లుబోయిన తనుశ్రీ(27 కేజీలు), లోచెల హరణ్యశ్రీ(30 కేజీలు), ప్రగడ చాందిని(50 కేజీలు), కామిరెడ్డి యసస్విని(55కేజీలు), సకల పూజిత(48 కేజీలు), కోసూరి మాధురి(35 కేజీలు), మొల్లి సౌమ్యశ్రీ వర్షిత(50 కేజీలు), జెర్రిపోతుల అంకిత(46 కేజీలు), తుపాకుల సత్యదుర్గ(36 కేజీలు) విభాగంలో కాంస్య పతకాలను సాధించారు. వీరిని కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, చింతకాయల రాజేష్‌లు అభినందించారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

## ఆకట్టుకున్న కొమ్ము నృత్యం

**ప్రజాశక్తి -నక్కపల్లి:**నక్కపల్లిలో పద్మశాలీల కుల దైవం భావనా ఋషి శూలాల సంబరం సందర్భంగా సోమవారం సాయంత్రంగ్రామ పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. ఈ సంబరం సందర్భంగా ఏర్పాటు చేసిన కొమ్ము డాన్స్, డప్పుల వాయిద్యాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

## గంజాయి నిర్మూలనకు కృషి చేయండి

**ప్రజాశక్తి- పాడేరు::** జిల్లాలో గంజాయి నిర్మూలనకు సంబంధిత శాఖలన్నీ కలసి సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన ఎన్కార్డు సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ద్వారా డ్రోన్ల సహాయంతో 274 గ్రామాలు పరిశీలించి సుమారు 82 ఎకరాలలో గంజాయి సాగును గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా రైతులను గుర్తించి వారికి గంజాయితో నష్టాలు, దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. వారికి ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జిల ద్వారా అవగాహన కల్పించాలని, వారికి అవసరమైన శిక్షణలు అందజేసి ఉపాధి కల్పించాలని, చిన్న చిన్న వ్యాపారాలకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా డిఎడిక్షన్ కేంద్రాలు పకడ్బందీగా పని చేసే విధంగా తీర్చిదిద్దాలని, మత్తుకు బానిసలైన వారిని గుర్తించి వారిని ఆ వ్యసనం నుండి బయటకు తీసుకు రావటానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో గంజాయికి సంబంధించి 208 కేసులు బుక్ చేసినప్పటికీ ఇంకా మారుమూల ప్రాంతాలలో సాగు జరుగుతోందని, వాటి నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కలాశాలలులో విద్యార్థులకు గంజాయి నియంత్రణ పై అవగాహనా కల్పించి తల్లిదండ్రులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖని ఆదేశించారు.

## గ్యాస్ డెలివరీలో అక్రమాలుంటే చర్యలు

**జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్**

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** : దీపం- 2 పథకం అమలులో అక్రమాలు జరిగితే బాధ్యులపై, ముఖ్యంగా గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ హెచ్చరించారు. విశాఖపట్టణం జిల్లా పౌర సరఫరాల అధికారి, సహాయ సరఫరా అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆయిల్ కంపెనీ యాజమాన్యాలు, గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ కలెక్టర్ సోమవారం సాయంత్రం దీపం-2 పథకంలో ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దీపం-2 పథకంలో భాగంగా గ్యాస్ బుక్ చేసుకొని సిలిండర్ డెలివరీ చేసిన 24 నుండి 48 గంటలలోపు సబ్సిడీ నగదు లబ్ధిదారుల ఖాతాకు జమ అవుతుందా అని గ్యాస్, ఆయిల్ కంపెనీ యాజమాన్యాలను వివరాలడిగారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన రోజే లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయిల్ కంపెనీల యజమానులు తెలిపారు. వివరాలు నమోదు చేసిన 24 నుండి 48 గంటలలోపు సబ్సిడీ నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని వివరించారు. సంబంధిత బ్యాంకుల నుండి లబ్ధిదారులకు అలర్ట్ మెసేజ్‌లు వెళ్లకపోవడం వల్ల వారికి సమాచారం తెలియడంలేదని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో రశీదులో ఉన్న ఎంఆర్‌పి ధర కంటే బాయ్‌లు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై దర్యాప్తు చేయాలని గ్యాస్ ఏజన్సీలకు సూచించారు. ఈ విషయమై లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే లీగల్ మెట్రాలాజీ యాక్టు ప్రకారం సంబంధిత గ్యాస్ ఏజన్సీలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీపం-2 పథకం అమలుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

## ఊపిరితిత్తుల్లో చెట్టు కొమ్మ

### తొలగించిన డాక్టర్ సుధీర్

కోలుకున్న చిన్నారితో వైద్యబృందం

తొలగించిన చెట్టుకొమ్మ

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** ఊపిరితిత్తుల్లో ఉన్న చెట్టుకొమ్మను తొలగించి ఆరు నెలల చిన్నారిని విజయనగరానికి చెందిన పల్మనాలజిస్టు డాక్టర్ టి.సుధీర్ కాపాడారు. ఒడిశాకు చెందిన 6 నెలల శిశువు తక్కువ రక్త ఆక్సిజన్ స్థాయిలు (60%), చిరాకుతో, విషమ స్థితిలో వెంకోజిపాలెం మెడికవర్ హాస్పిటల్ అత్యవసర విభాగానికి వచ్చింది. ఆ రోజు ఉదయం పాప చింతపండు గింజను పీల్చిందని తల్లి చెప్పడంతో డాక్టర్ హేమంత్, డాక్టర్ లక్ష్మణ్ నేతృత్వంలోని ఎమర్జెన్సీ బృందం వెంటనే శిశువును బ్రాంకోస్కోపీ సూట్‌కు తరలించారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే అత్యవసర బ్రాంకోస్కోపీ నిర్వహించి, శిశువు ఊపిరితిత్తులలో ఒక చెట్టు కొమ్మ చిక్కుకున్నట్లు గుర్తించారు. దీని వల్ల వాయుమార్గంలో అడ్డంకి ఏర్పడింది. వైద్య బృందం 10 నిమిషాల్లోనే బ్రాంకోస్కోపీ బాస్కెట్‌ను ఉపయోగించి చెట్టు కొమ్మను విజయవంతంగా తొలగించారు. దీంతో శిశువు చురుకుగా మారింది. ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడ్డాయి. మరుసటి రోజే ఆ చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ప్రాణాలను కాపాడిన మెడికవర్ హాస్పిటల్‌లోని డాక్టర్ టి.సుధీర్ వైద్య బృందానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ టి.సుధీర్ తల్లిదండ్రులు తలే సీతారాం, ఝాన్సీరాణి విజయనగరం సీతారాం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.అనిల్‌కుమార్, డాక్టర్ టి.శిరీష, డాక్టర్ ఎం.నవ్యశృతి తదితరులు డాక్టర్ సుధీర్‌కు ప్రశంసలు తెలిపారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

**ప్రజాశక్తి-పెదబయలు :**స్థానిక ఆశ్రమ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించి సోమవారం కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేసారు. 105 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.